డోలోత్సవం చూతము రారండి

● శ్రీకూర్మనాథుని సన్నిధిలో నేటి నుంచి మూడు రోజులపాటు వేడుకలు



శ్రీకూర్మనాథుడు

గార, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. గార మండలం శ్రీకూర్మంలో బుధవారం నుంచి డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడురోజులపాటు ఈ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తొలిరోజు బుధవారం కామదహనోత్సవంతో వేడుకలు ప్రారంభమవుతాయి. గురువారం స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం గ్రామసమీపంలో కామదహన మండపం వద్ద అశేష భక్తజనుల మధ్య అర్చక స్వాములు కామదహనోత్సవాన్ని నిర్వహిస్తారు. ఎండిన కొబ్బరికొమ్మను నిలబెట్టి దానికి పూజలు చేసిన అనంతరం హోమం నిర్వహించి.. ఆ కొబ్బరి కొమ్మకు నిప్పంటిస్తారు. శ్రీమహావిష్ణువు తన కోర్కెలు దహింపజేసుకోవడానికి గుర్తుగా ఈ కామ దహనోత్సవాన్ని నిర్వహిస్తారు. 14న డోలోత్సవంలో భాగంగా శ్రీదేవి, భూదేవి, గోవిందరాజుస్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం వాటిని డోలో మండపంలోని ఊయలలో ఉంచుతారు. అక్కడ స్వామిని ఉత్తరాభిముఖంగా భక్తులు దర్శిస్తారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలైన విజయనగరం పూసపాటి గజపతుల గోత్రనామాలతో స్వామి బుక్కా భర్గుండతో పూజలు చేస్తారు. ఈ డోలోత్సవాలను తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. కూర్మనాథుడికి పూజలు చేయనున్నారు.

పురాణగాథల్లో ఇలా..

శ్రీకూర్మం.. శ్రీ మహావిష్ణువు కూర్మావతారంలో స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం. రెండు ధ్వజస్తంభాలు, 108 నల్లరాతి స్తంభాలతో పశ్చిమాభిముఖుడైన శ్రీకూర్మం రూపంలో మహావిష్ణువు ఇక్కడ అవతరించారు. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణగాథల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయం ఎప్పుడు నిర్మితమైందన్న దానికి చారిత్రక ఆధారాలు లేవు. కాగా.. నాలుగో శతాబ్దం నుంచి 14, 16 శతాబ్దాల వరకు అప్పటి రాజులు ఆలయ అభివృద్ధికి ఎంతెంత విరాళాలు ఇచ్చారన్నది స్తంభాలపై ఉన్న శాసనాల ద్వారా తెలుస్తోంది. 1135లో అనంతపద్మ చోళగంగదేవుడు దండయాత్ర చేస్తూ పశ్చిమోత్తర దేశాన్ని జయించినట్లు ఒక శాసనంలో ఉంది. 12వ శతాబ్దానికి పూర్వం దీనికి శైవక్షేత్రంగా వ్యవహరించేవారని ఒక వాదన ఉంది. ఈ ఆలయం పైభాగం అష్టదళ పద్మాకారంలో ఉండటం విశేషం.



శ్రీకూర్మనాథ ఆలయం



కోరాడ గణేష్ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఫైల్)

దోచింది రూ.5.86 కోట్లు.. దొరికింది రూ.15.84 లక్షలు

● పరారైన చిట్ వ్యాపారి ఆస్తుల జప్తు ● రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు జారీ

● నాలుగేళ్ల కిందట మోసం చేసి.. ఉడాయించిన వైనం

● కేసు విచారించి నివేదిక అందజేసిన సీఐడీ

నరసన్నపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల కిందట నరసన్నపేటలో సుమారు రూ.ఆరుకోట్లు టోకరా పెట్టి.. పరారీ అయిన చిట్‌ఫండ్ వ్యాపారి కోరాడ గణేశ్వరరావు అలియాస్ గణేష్ చరాస్తులను జప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక కలివరపుపేటకు చెందిన కోరాడ గణేశ్వరరావు పట్టణంలో లక్ష్మీ గణేష్ చిట్స్ పేరుతో 17 ఏళ్లుగా వడ్డీ వ్యాపారం నిర్వహించేవాడు. అధిక వడ్డీ ఆశ చూపి ప్రజలను నమ్మించేవాడు. ఈ క్రమంలో 2021 నాటికి 48మంది బాధితుల నుంచి రూ.2.50లక్షలు, రూ.5లక్షలు, రూ.10లక్షలు చొప్పున చీటీల పేరుతో.. రూ.3,26,62,950 సేకరించాడు. అలాగే మరో 26 మంది బాధితుల నుంచి రూ.2,59,90,000 వసూలు చేసి కుటుంబంతో ఉడాయించాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించి బాధితులు లబోదిబోమన్నారు. అప్పట్లో ఈ వ్యవహారంపై నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ మేరకు అప్పుడు పోలీసులు దర్యాప్తు చేశారు. గణేష్.. చీటీలు, డిపాజిట్ల రూపంలో రూ.5.86కోట్లు వసూలు చేసి (మిగతా 7వ పేజీలో..)

అమ్మేసుకున్నామోచ్!

● సంతకాలు ఫోర్జరీచేసి ఇళ్లపట్టాలు విక్రయించి..

● జగతిమెట్ట జగనన్న కాలనీలో అక్రమాలెన్నో..

● రోజుకో వ్యవహారం వెలుగులోకి వస్తున్న వైనం

● గతంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది చేతివాటం

● బాధ్యులపై సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధం

టెక్కలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని శ్యామసుందరాపురం రెవెన్యూ పరిధి జగతిమెట్ట జగనన్న ఇళ్ల కాలనీ 287, 288 సర్వే నెంబర్లలో రోజురోజుకీ అక్రమాలు బయటపడుతున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారిలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది ఉండడం విస్మయం గొల్పుతోంది. వైసీపీ హయాంలో రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి.. ఫోర్జరీ సంతకాలతో, పాత తేదీలతో ఇళ్ల పట్టాలు విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో టెక్కలిలో పనిచేసిన వీఆర్‌వోలు, ఆర్‌ఐలు, డీటీ, తహసీల్దార్ల పాత్రపై విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. జగతి మెట్ట ఇళ్ల కాలనీలో అక్రమాలు వెలికితీయాలని ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తికి ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల ఆర్డీవో ఇతర మండలాల నుంచి రెవెన్యూ సిబ్బందిని పిలిపించి విచారణ చేయించారు. అప్పట్లో జగతిమెట్ట కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు ఎవరు, పట్టాలు తీసుకున్న వారే ఉన్నారా?, వేరెవరు ఉన్నారా? అని ఆరా తీయగా సగం అక్రమాలు బయటపడ్డాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగతిమెట్ట లేఅవుట్‌లో 332 మందికి పట్టాలు జారీచేస్తే.. రెవెన్యూ సిబ్బంది పరిశీలనలో 55మంది మాత్రమే పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడ ఉన్నారు. మిగిలిన 277మంది లబ్ధిదారుల జాడ కనిపించలేదు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడ పట్టాలు పొందిన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే తహసీల్దార్, సబ్‌కలెక్టర్ కార్యాలయాలకు హాజరు కావాలని వారం రోజులు గడువు సైతం ఇచ్చారు. కనీసం 50 మంది లబ్ధిదారులైనా దర్యాప్తు అధికారుల వద్దకు హాజరుకాలేదు. దీంతో రెవెన్యూ అధికారులకు మరింత అనుమానాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆర్డీవో మరింత లోతుగా దర్యాప్తు చేశారు. గతంలో పనిచేసిన వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బందిని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. ఇళ్లకాలనీలో అక్రమాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది తప్పులు బయటపడ్డాయి. రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి.. పట్టాలను అనర్హులకు విక్రయించినట్టు తేలింది. దీంతో అక్రమాలకు (మిగతా 7వ పేజీలో..)



జగతిమెట్ట ఇళ్ల కాలనీ



గంగాధర్ (ఫైల్)

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరు పలాసవాసుల మృతి

● మహేంద్రగిరి నుంచి చింతపండు తీసుకువస్తుండగా ఘటన

● సూదికొండ, సాయిబులకాలనీలో విషాదఛాయలు

8లో



సయ్యద్‌ఫరీద్ (ఫైల్)

మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

● రూ.87.50 లక్షల ఎంపీల్యాడ్ నిధులు విడుదల

● 15న మంత్రుల శంకుస్థాపన

8లో



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

కాలువ గట్లపై సోలార్ ప్లాంట్లు

● 'పీఎం కుసుమ్' పథకం ఏర్పాటుకు 25 చోట్ల స్థలాల గుర్తింపు

8లో

ఫిషింగ్ జెట్టీలు నిర్మించండి

● కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

7లో

పోర్టు పనులకు.. లైన్‌క్లియర్

● రోడ్డు, రైల్వే అనుసంధానానికి మార్గం సుగమం

● విష్ణుచక్రం నిర్వాసితులకు క్లస్టర్ రూపేణా లాటరీ ద్వారా ఎంపిక

● టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి రోడ్డు, రైల్వే అనుసంధానం ప్రక్రియ కొలిక్కి వచ్చిందని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'పోర్టు రహదారికి సంబం ధించి 228 ఎకరాల జిరాయతీకిగాను ఇప్పటికే ఇజ్జువరం, వేములాడవిశ్వనాథపురం, తలగాం, బన్నువాడ గ్రామాలకు చెందిన భూములకు ల్యాండ్ ఎక్విజేషన్ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం 18ఎకరాల ల్యాండ్ ఎక్విజేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. అందులో తొమ్మిది ఎకరాలు దేవాదాయశాఖవి. కస్పా నౌపడాకు చెందిన 4.77ఎకరాలు, రఘునాథపురానికి చెందిన ఎకరా, మోదుగువలసకు చెందిన 53సెంట్లు, రాజపురానికి చెందిన పదిసెంట్లు, పాతనౌపడాకు చెందిన ఎకరా 9సెంట్ల భూమి పెండింగ్‌లో ఉంది' అని ఆర్డీవో తెలిపారు.

● రైల్వే అనుసంధానానికి సంబంధించి 72ఎకరాలకుగాను పోతునాయుడుపేట, యామాలపేట, రాజపురం, కాశీపురం, కోటపాడు, కూర్మనాథపురం గ్రామాలకు చెందిన 251 మంది రైతులకు రూ.19కోట్లు చెల్లించాం. కూర్మనాథపురంలో ముగ్గురు రైతులకు చెందిన ఎకరన్నర భూమికి పరిహారం చెల్లించాల్సి ఉంది. మూలపేట పంచాయతీ విష్ణుచక్రం గ్రామానికి చెందిన 80మంది పీడీఎఫ్‌లకు మొదటివిడత పునరావాస కాలనీలో ఇళ్ల కేటాయింపులకు బీసీ, ఎస్సీల వారీగా 28 క్లస్టర్లు ఏర్పాటు చేశాం. లాటరీ ద్వారా ఎంపికకు సిద్ధం చేశాం. నిర్వాసితుల కాలనీ ప్రాంతంలో 598 పీడీఎఫ్‌లకు సంబంధించి రూ.2.90 కోట్లతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం. ఆయా ప్రాంతాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.2.50కోట్లతో తాగునీటి సదుపాయానికి పైపులైన్లు, ట్యాంకర్లు కల్పించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. నిర్వాసితుల కాలనీ ప్రాంతంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.7కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, అప్రోచ్‌రోడ్లు నిర్మాణాలకు సంబంధించి ఇప్పటికే రూ.1.50 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మిగిలిన రూ.5.50 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంద'ని ఆర్డీవో వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఆమదాలవలస: చింతాడ గ్రామంలో తాగునీటి కోసం ప్రజల పాట్లు

ప్ర'జల' కష్టాలు తీరేదెన్నడో!

● ఏళ్ల తరబడి వేధిస్తున్న తాగునీటి సమస్య

● వేసవి వస్తుండడంతో ఆందోళన

వేసవి సమీపిస్తున్న వేళ.. జిల్లావాసుల్లో తాగునీటి సమస్య గుబులు రేపుతోంది. ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రధానంగా పట్టణాల్లో చాలా ప్రాంతాలకు ట్యాంకర్ల నీరే ఆధారమవుతోంది. ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధి ప్రజలను 30 ఏళ్లుగా తాగునీటి కొరత వెంటాడుతూనే ఉంది. 23 వార్డులకుగానూ రెండు ట్యాంకర్లతో రెండురోజులకోసారి నీటి సరఫరా చేస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో బావులు, బోర్లు ఎండిపోవడంతో అక్టోబరు నుంచీ ట్యాంకర్ల ద్వారానే నీరు సరఫరా చేస్తున్నారు. ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధి పెద్దపాడులో కుళాయిలు ఏర్పాటు చేసినా నీరు మాత్రం రావడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు నీటికష్టాలు తీర్చేలా చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

6లో

లక్ష్యాలను పూర్తి చేయాల్సిందే

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి అభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, గ్రామ సచివాలయం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'పల్లెపండుగ పనులను త్వరగా పూర్తి చేయాలి. ఉపాధిహామీ పథకం కింద వేతనదారులకు పని దినాలను పెంచాలి. గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలి. కాలువలు, చెత్త కుప్పల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపరచాలి. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేయని 200 పంచాయతీలు వివరణ ఇవ్వాల'ని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే - ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంకు, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటి నుంచి పని, పి-4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై ఆయా అధికారులు సమగ్ర వివరాలు అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీవో భారతి సౌజన్య, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ. కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట: జగన్నాథపురం కాలనీలో తాగునీటి కోసం పడిగాపులు



'పేట'లో దాహం కేకలు

నరసన్నపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. వారం రోజులుగా కుళాయిల నీరు అరకొరగా వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మేజర్ పంచాయతీలో 87 వీధులు ఉండగా .32వేల మంది ప్రజలు నివశిస్తున్నారు. రోజుకు 36 లక్షల లీటర్ల నీరు పట్టణ ప్రజలకు అవసరం. దేవాది నుంచి నరసన్నపేటకు తాగునీటిని పైపులైన్ ద్వారా తీసుకు వస్తున్నారు. దేవాది వద్ద బోరు బావులు కుంగిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. ఇక జగన్నాథపురం, శివనగర్ కాలనీ, బండివీధి, శ్రీనివాసనగర్‌లో ఎప్పుడు కుళాయిల్లో నీరు వస్తుందో తెలియని పరిస్థితి. వంశధార నగర్, కృష్ణానగర్, కామేశ్వరి నగర్ తదితర వీధులకు కుళాయిలు లేకపోవడంతో తాగునీటిని క్యాన్లతో కొనుక్కోవలసి వస్తోంది. ఈ విషయమై ఈవో దాక్షాయణి వద్ద ప్రస్తావించగా దేవాది వద్ద బోరుబావులను అందుబాటులోకి తీసుకువచ్చి.. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇచ్ఛాపురం: ట్యాంకర్ల వద్ద నీటి కోసం మహిళల పాట్లు



ప్రజల కష్టాలు తీరేదెన్నడో!

- ఏళ్ల తరబడి అవస్థలు
- వేసవి ఆరంభంలోనే తీవ్రం

వేసవి ఇప్పుడే మొదలైంది. పట్టణాలు...పల్లెలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల ఏళ్ల తరబడి ఉన్న నీటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికీ వివిధ మున్సిపాలిటీల్లోని శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల నీరే ఆధారం. అవీ అరకొరగా ఉండడంతో నీటి కోసం మహిళలు యుద్ధాలు చేయడం నిత్యకృత్యంగా మారింది. అధికార యంత్రాంగం స్పందించి...నీటి కష్టాల నుంచి ఒడ్డెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

30 ఏళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్య

ఆమదాలవలస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో శివారున ఉన్నవిగా గుర్తింపు పొందిన నాలుగు వార్డుల ప్రజలకు ఏళ్ల తరబడి తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆమదాలవలస మున్సిపాలిటీగా రూపుదిద్దుకొని 30 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ప్రజల కనీస అవసరాల్లో ఒకటైన తాగునీటిని పూర్తి స్థాయిలో అందించడంలో ప్రభుత్వాలు, మున్సిపల్ పాలక వర్గాలు విఫలమయ్యాయి. మున్సిపాలిటీలో 23 వార్డులు ఉన్నాయి. అందులో 19 వార్డులకు వంశధార నది నుంచి రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన నాలుగు వార్డుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకటో వార్డు తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశుని పేట, ఐదో వార్డు అక్కివలస, గేదెలవానిపేట, సొట్టవానిపేట, పంతులువానిపేట, రెడ్డిపేట గ్రామాలతో పాటు ఆరో వార్డులో ఉన్న సప్తపురాలు, ఏడో వార్డు చింతాడ గ్రామానికి చెందిన ప్రజలకు మున్సిపాలిటీ ఆవిర్భాం నుంచీ తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నాలుగు వార్డుల్లో ఉన్న గ్రామాలకు ప్రతి రోజూ ట్యాంకర్‌తోనైనా తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నా... ఫలితం ఉండడం లేదు. మున్సిపాలిటీకి చెందిన రెండు వాటర్ ట్యాంకులుం, పార్లమెంట్ సభ్యుల నిధులతో ఇచ్చిన మరో ట్యాంకు మొత్తం మూడు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీనిలో ఒక ట్యాంక్ మరమ్మతులకు గురై నిత్యం మున్సిపల్ కార్యాలయంలోనే ఉంటుంది. మిగిలిన రెండు ట్యాంకులతో చివరి వార్డుల ప్రజలకు రెండురోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ట్యాంకు వచ్చిందంటే బిందెలతో మహిళలు యుద్ధాలు చేసుకోక తప్పడం లేదు. చింతాడ గ్రామంలో అయితే నీళ్లట్యాంక్ వద్ద మహిళల సిగపట్లు నిత్యకృత్యంగా కనిపిస్తాయి. వర్షాకాలం, శీతాకాలం, తాగునీటి సమస్య అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ వేసవి కాలంలో మాత్రం పరిస్థితి దారుణంగా ఉంటోంది. దీంతో ఈ నాలుగు వార్డుల ప్రజలు ఇప్పటి నుంచే తాగునీటి కోసం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని ఐదో వార్డు పంతులుపేట, సొట్టవారిపేట, రెడ్డిపేట, గేదెలవానిపేట గ్రామాలకు మున్సిపాలిటీ అధికారులు తాగునీరు అందించడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు తంగి గురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో తాగునీరు సరఫరా చేసే నీళ్లట్యాంక్‌లను కూడా అందుబాటులో లేకుండా చేయడం వల్ల ప్రస్తుతం సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చివరి నాలుగు వార్డుల ప్రజలకు తాగునీరు అందించడానికి కృషి చేయాలని కోరారు.

రక్షిత నీటి పథకం మంజూరు చేయండి..

మున్సిపాలిటీ ఆరో వార్డులో సప్తపురాలుగా గుర్తింపు పొందిన ఏడు గ్రామాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా పూర్తి స్థాయిలో తాగునీరు అందడం లేదని నాదనాపురం గ్రామానికి చెందిన పాతిన వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామాల ప్రజలకు రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణానికి దూరంగా ఉన్న తమ ఏడు గ్రామాలకు నీళ్ల ట్యాంకర్లు పంపించడానికి మున్సిపల్ అధికారులు సుముఖత చూపడం లేదని ఆరోపించారు. ప్రతినిత్యం తాగునీటి సమస్యలు తలెత్తుతున్నందున తమ ఏడు గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

అక్టోబరు నుంచి ట్యాంకర్ల నీరే గతి

ఆంధ్రజ్యోతి పరిశీలన



మున్సిపల్ ట్యాంకరు నీటి కోసం రోడ్డు పక్కన డ్రమ్ములు పెట్టుకున్న సూదికొండ వాసులు

పలాస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ కాలనీ, రెల్లివీధికి తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. అక్టోబరు నెల నుంచే బావులు, బోర్లు ఎండిపోవడంతో మున్సిపల్ అధికారులు సరఫరా చేస్తున్న ట్యాంకర్ల నీరే దిక్కవుతోంది. పురపాలక సంఘం ఏర్పడిన నాటి నుంచి నీటి సమస్య ఉంది. శాశ్వత పరిష్కారం లభించకపోవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో సాధారణంగా ఫిబ్రవరి నెల వచ్చిందంటే నీటి సమస్యలు రావడం సహజం. హడ్కో కాలనీ, ఉదయపురం, తాళభద్ర, న్యూ కాలనీ, తిలక్‌నగర్, శాంతినగర్ కాలనీ, పెంటిబద్ర గ్రామాల్లో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ముందుచూపుగా ఈ ప్రాంతంలో పవర్ బోర్లు వేసి తాత్కాలిక ఉపశమనం కల్పిస్తున్నారు. సూదికొండ కాలనీ చివరిలో ఉన్న రెల్లివీధిలో మాత్రం నీటి సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. అక్కడ నీటి లభ్యత తక్కువగా ఉంటోంది. బోర్లు వేసినా ఒక్క ఏడాదిలోనే అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో మూడు పవర్ బోర్లు వేసినా అరకొరగానే నీరు వస్తోంది. ఒక్క రెల్లివీధిలోనే 200కు పైగా గృహాలు ఉన్నాయి. రోజుకు నాలుగు ట్యాంకర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ఆ నీరు తమ అవసరాలకు సరిపడడం లేదని.. పూర్తి స్థాయి నీరు అందించాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా హడ్కో కాలనీ, రాజమ్మ కాలనీలో కూడా తీవ్ర నీటి సమస్యలు ఉన్నాయి. పవర్ బోర్లు వేసినా ఫలితం ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఈ మూడు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఒక్కరోజు నీరు ఇవ్వకపోతే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎమ్మెల్యే సూచన అమలయ్యేనా?

మున్సిపాలిటీకి ఉద్దానం రక్షిత మంచినీటి పథకం ఇచ్చి అంతవరకూ తాగునీటి సమస్య లేకుండా చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష... కలెక్టర్, ఉద్దానం రక్షిత మంచినీటి పథక నిర్వాహకులకు అభ్యర్థించారు. వారు సూచన ప్రాయంగా అంగీకరించినా.... ఇంకా సంబంధిత పనులు ప్రారంభించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర మంచినీటి పథకం అమలులో ఉన్న తరుణంలో ఉద్దానం రక్షిత మంచినీటి పథకంపై స్థానికులు ఆశ పెట్టుకున్నారు. ఈ పథకం అమలులోకి వస్తే సగం ప్రాంతానికి పూర్తి స్థాయి మంచినీరు లభించే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

శాశ్వత మంచినీటి పథకాలు ఏవీ?

మున్సిపాలిటీ మీదుగా సమగ్ర మంచినీటి పథకం పైపులైన్లు వెళ్తున్నా ఇక్కడికి ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. మున్సిపాలిటీకి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఆధారిత మంచినీటి పథకం మంజూరులో ఉన్న కారణంగా సమగ్ర మంచినీటి పథకాన్ని అనుసంధానించలేదు. పూర్తిగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని... కనీసం వేసవిలోనైనా నీరు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను స్థానికులు కోరుతున్నా తాము ఏమీ చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తయితేగానీ మున్సిపాలిటీకి శాశ్వత మంచినీటి పథకం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



పదేళ్లుగా తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నాం. మున్సిపల్ అధికారులు ట్యాంకులతో సరఫరా చేస్తేనే మాకు తాగునీరు. లేకుంటే కొండదిగి నీరు తెచ్చుకోవాల్సి ఉంటుంది. శాశ్వత మంచినీటి పథకం మంజూరు చేసి మా నీటి కష్టాలు తొలగించాలి.

- జోగి బెడ్డెమ్మ, సూదికొండ కాలనీ

తాగునీటికి కటకటే!



కుళాయిల వద్ద అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఇచ్ఛాపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. మున్సిపాల్టీలో 23వార్డులు ఉన్నాయి. అందులో 21 వార్డులలో 15 ఏళ్ల కిందట తాగునీటి పైపులైన్లు వేశారు. అప్పట్లో 28 వేల మంది జనాభాకు తగ్గట్టుగా వీటిని వేశారు. కానీ ఇప్పుడు పట్టణంతో పాటు జనాభా పెరిగింది. కానీ జనాల అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా లేకుండా పోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 36 వేల మంది జనాభా అని చెబుతున్నా.. ఆ సంఖ్య 50 వేలకుపైగా పెరిగినట్టు తెలుస్తోంది. అందుకు తగ్గట్టు నీటి సరఫరా చేయడం లేదు. ఉన్న కుళాయిల నుంచి నీటిని పట్టుకోవలసి వస్తోంది. ప్రస్తుతం పట్టణంలో 15 బోర్లు పనిచేయడం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ అంతకంటే ఎక్కువే బోర్లు మూలకు చేరాయని తెలుస్తోంది. ముఖ్యంగా రత్తకన్న పరిధిలో చాలా వీధులకు రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

మా బాధలు వర్ణనాతీతం..



పేరుకే మున్సిపాలిటీ. కానీ చిన్నపాటి గ్రామం కంటే తక్కువే. తాగునీటి సమస్య దశాబ్దాలుగా ఉంది. ఎప్పుడో దశాబ్ద కాలం కిందట పైపులైన్లు, కుళాయిలు పాడ య్యాయి. ఎప్పుడు నీటి సరఫరా ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. ఇప్పటి కైనా ప్రభుత్వం దృష్టిపెట్టాలి. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలి.

- కొరికాన యోగి, స్థానికుడు, ఇచ్ఛాపురం

శాశ్వత పరిష్కారమేదీ?



జిల్లా కేంద్రం తరువాత ఏర్పడిన మున్సిపాలిటీ ఇది. కానీ ఆ స్థాయిలో మౌలిక వసతులు లేవు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించాలి.

- కేసీ పూరి, స్థానికుడు, ఇచ్ఛాపురం

మూలకు చేరిన ప్రాజెక్టులు

ఉద్దానం ప్రాజెక్టులో భాగంగా బాహుదా నదిలో ఊటబావులు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. క్లోరినేషన్ చేపట్టిన తరువాత రాజావారితోటలో రిజర్వాయర్ ద్వారా పట్టణ అవసరాల కోసం 8 లక్షల లీటర్ల నీటిని ప్రతిరోజూ విడిచి పెడుతున్నారు. ఈ నీరు ప్రజల అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. రూ.54.48 కోట్ల కేంద్ర నిధులతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు నిర్మాణ దశలో ఉంది. అది పూర్తయితే కానీ.. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం లేదు. 1, 2, 3 వార్డుల పరిధిలోని పురుషోత్తపురం, ఏఎస్‌పేటకు ఏర్పాటు చేసిన పైపులైన్లు లీకులయ్యాయి. ట్రయల్ రన్ వేసి వదిలేశారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అరకొరగా సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న ట్యాంకర్‌ను నిర్మించి వృథాగా వదిలేశారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి చోటిచ్చారు. కానీ..ఇంతవరకూ నీటిని అందించలేదు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. వైసీపీ ఐదేళ్ల కాలంలో నీటి సమస్యను పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వంపైనే స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.

కుళాయిలు ఉన్నా...

23 వార్డులకు గానూ 21 వార్డుల్లో కుళాయిలు ఏర్పాటు చేశారు. అది కూడా రోజు విడిచి రోజు కుళాయి నీరు వస్తుంది. దీంతో ప్రజలు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన నీరు కూడా అరకొరగానే ఉంటోంది. కొన్ని చోట్ల మురుగు కాలువల చెంతనే కుళాయిల నీరు వస్తోంది. మహిళలు ముక్కులు మూసుకొని నీటిని పట్టుకుంటున్నారు. చాలీచాలనీ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తుండటంతో ట్యాంకర్ల వద్ద యుద్ధాలు నిత్యకృత్యమైపోయాయి. 1,2,3 వార్డులలోని ఏఎస్‌పేట, పురుషోత్త పురంలో ఏళ్ల తరబడి తాగునీటికి ఇబ్బందులే. పన్నుల రూపంలో అధికారులు డబ్బులు దోచుకుం టున్నారే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అంతంత మాత్రమే..

ఇచ్ఛాపురం పట్టణ జనాభాకు రోజుకు సగటున 5.10 మిలియన్ లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం అందులో సగం నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. 1, 2, 3 వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భూ మట్టానికి మూడు నుంచి ఐదు అడుగుల గోతులో

నీటి ఎద్దడి నిజమే



మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి నిజమే. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని అందిస్తు న్నాం. ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. త్వరలో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకంతో పాటు కేంద్ర నిధులతో చేపడుతున్న ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. అంతవరకూ ఇబ్బందులు తప్పవు.

- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

పెద్దపాడు వాసులదీ అదే పరిస్థితి

శ్రీకాకుళం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం శివారులోని పెద్దపాడు గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో దాదాపు 15 ఏళ్లుగా మంచినీటి కోసం పోరాడుతున్న ఏకైక గ్రామం పెద్దపాడు. స్థానిక గాంధీనగర్ కాలనీ నిర్మించి 30 ఏళ్ల గడిచింది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాలనీలో 21 ఇళ్లు అగ్నికి ఆహుతైన సందర్భంలో అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఇంటింటికి కుళాయిల కార్యక్రమాన్ని చేపట్టారు. అదే సందర్భంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేశారు. ఇక ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు అందించే సమయానికి ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. పెద్దపాడు గ్రామాన్ని అభివృద్ధి చేస్తారన్న నమ్మకంతో అదే ప్రాంతంలో నివశిస్తున్న ధర్మాన ప్రసాదరావును 2019లో శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిపించారు. 2024 వరకు వైసీపీ ఎమ్మెల్యేగా, మంత్రిగా వ్యవహరించిన ధర్మాన ప్రసాదరావు ఆ గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించకపోవడంతో పాటు టీడీపీ హయాంలో కుళాయిలు వేశారనేన కారణంతో గ్రామానికి మంచి నీరు అందించే పనులు నిలిపివేశారు. దీంతో పెద్దపాడులోని 600 కుటుంబాలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాయి. ప్రైవేటు వాహనాలతో గ్రామానికి నీరు సమకూరుస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఈ గ్రామాన్ని నగర పాలక సంస్థలో విలీనం చేసినప్పటికీ నగర పాలక అధికారులు సైతం మంచినీటి సమస్యపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

కళ్లేపల్లిలోనూ...

శ్రీకాకుళం రూరల్ మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో సైతం ప్రజలకు మంచి నీటి సమస్యలు తప్పడం లేదు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గ్రామంలో ఒక్క కుళాయి కూడా వేసిన పాపాన పోలేదు. ఇక్కడ 1,224 కుటుంబాలు నివశిస్తున్నాయి. సర్పంచ్ నివాసం ఉంటున్న వీధిలోనే కుళాయిలు లేక ట్యాంకుల వద్దకు మంచినీటి కోసం ప్రజలు పరుగులు తీయడం కొసమెరుపు.



చుక్క నీరివ్వని వీధి కుళాయి

కంటిచూపును హరించే గ్లకోమా

- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం
- నేడు ప్రపంచ గ్లకోమా నివారణ దినం

అరసవల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. మన శరీరంలో అత్యంత ము ఖ్యమైన భాగాలు కళ్లు. అటువంటి కంటి చూపును నిశ్శబ్దంగా దెబ్బతీసేది గ్లకోమా. దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది కంటి చూపును కోల్పోతున్నారు. గ్లకోమాపై అవగాహన కల్పించడానికి ఏటా మార్చి 12న ప్రపంచ గ్లకోమా నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు.

గ్లకోమా అంటే..

గ్లకోమాను నీటి కాసుల వ్యాధి అని కూడా అంటారు. కంటిలో ఒత్తిడి పెరగడం వల్ల ఆప్టిక్ నాడిని దెబ్బతీస్తుంది. దానివల్ల దృష్టి కోల్పోయే ప్రమా దం ఉంటుంది. ఇది నొప్పి లేకుండా నెమ్మదిగా చూపును మాయం చేసే వ్యాధి.

కారణాలు ఇవీ..

మధుమేహం, రక్తపోటు (బీపీ), జీవనశైలిలో మార్పులు కారణంగా కంటిలో ఒత్తిడి పెరిగినప్పుడు ఆప్టిక్ నాడి దెబ్బతింటుందని నేత్ర వైద్య నిపుణులు చెబుతున్నారు. వంశపారంపర్యం వల్ల కూడా నేత్ర సమస్యలకు కారణమవుతుంది. తాజా అధ్యయనాల ప్రకారం ఒత్తిడికి, ఆందోళన, గ్లకోమాకు కూడా సంబంధం ఉన్నట్టు తేలింది. ఒత్తిడి కారణంగా శరీరంలో కార్టిసాల్ స్థాయిలు పెరిగి, కంటిలో ఒత్తిడి అధికమవుతుంది. ఇలా పలు మార్లు ఒత్తిడి హెచ్చుతగ్గులు అయినప్పుడు కంటిలోని ఆప్టిక్ నరంపై ప్ర భావం పడుతుంది. ఆహార నియమాలు పాటించకపోవడం, ధూమ పానం, మద్యపానం, అధిక ఒత్తిడి, హ్రస్వ దృష్టి (మయోపియా), ముఖా నికి రాసు కునే సౌందర్య క్రీముల్లో వాడే స్టెరాయిడ్స్ వల్ల గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా కనుగుడ్డు పక్కల నుంచి చూపు హరించడం మొదలవు తుంది. నేరుగా అన్నీ చూడగలుగుతున్న నేపథ్యంలో పక్క నుంచి వచ్చే సమస్యలను పట్టించుకోరు. అనుమానం తలెత్తి వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకున్నప్పుడు మాత్రమే సమస్యలు బయట పడతాయి.

అవగాహనతోనే దూరం చేయగలం




జిల్లాలో గ్లకోమా వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారు. అవగాహన లోపం వల్ల వీరిలో ఎక్కువమంది చూపును కోల్పోతున్నారు. జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షల వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం. 40 ఏళ్లు పైబడిన వారు క్రమం తప్పకుండా కంటివైద్యుని వద్ద పరీక్షలు చేయించుకోవాలి. జిల్లా జనాభాలో 2.9 శాతం మంది ఈ గ్లకోమా వ్యాధితో బాధ పడుతున్నారు. ఇది చాలా ఎక్కువ శాతం. రిమ్స్ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి.

- డాక్టర్ చోడిపల్లి గురుమూర్తి, కంటి వైద్య నిపుణులు, రిమ్స్, శ్రీకాకుళం

లక్షణాలు ఇవే..

గ్లకోమాలో రెండు రకాలు ఉన్నాయి. ఒక టి నెమ్మదిగా చూపును హరిస్తే, రెండో రకంలో చూపు హఠాత్తుగా పోతుంది. ఒకసారి చూపును కోల్పోయాక శస్త్రచికిత్సతో కానీ... మందులతో కానీ తిరిగి తెప్పించే వీలు పడదు. సాధారణంగా కళ్ల నొప్పులు, వాంతులు, కళ్లు ఎర్రబా రడం, దృష్టి లోపం, కంటిలో కాంతి వలయాలు, ఆకస్మిక దృష్టి లోపాలు గ్లకోమాలో కనిపిస్తాయి.



నిర్ధారణ ఇలా...

టోనొమెట్రీ పరీక్ష ద్వారా కంటి లోపల ఉన్న ఒత్తిడిని కొలుస్తారు. దీనిని ఐఓపీ అని అంటారు. ఈ ఐఓపీ 21 కంటే తక్కువ ఉంటే సాధారణ పరిస్థితి. ఇది 21 కంటే ఎక్కువగా ఉంటే గ్లకోమా వ్యాధిగా వైద్యులు నిర్ధారిస్తారు. అలాగే ఆప్టిక్ నెర్వ్ పరీక్ష, వ్యాపక కోణ పరీక్ష (జెనియోస్కోపీ) పరీక్షలు కూడా నిర్వహిస్తారు.

నివారణ ఎలాగంటే..

బీపీ, షుగర్ వ్యాధి ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడుతూ వాటిని అదుపులో ఉంచుకోవాలి. విటమిన్ ఎ, సి, ఇ, ఒమెగా-3 ఆమ్లాలు కలిగిన ఆహారం ఎక్కువగా గల ఆహారం తీసుకోవాలి. పొగతాగడం, ఆల్కహాల్ తీసుకోవడం మానేయాలి. కళ్లకు ప్రత్యేక వ్యాయామాలు చేయాలి. 40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా 6 నెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. అవగాహనతోనే నివారణ సాధ్యపడుతుంది.

చికిత్స ఇలా..

కంటి చుక్కల మందులు (ఐ డ్రాప్స్) కళ్ల ఒత్తిడిని తగ్గించేందుకు, లేజర్ ట్రీట్‌మెంట్, గ్లకోమా శస్త్ర చికిత్సలు చేస్తారు. గ్లకోమాను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభం అవుతుంది. ఒకసారి దెబ్బతిన్న కంటి నరాలు మరలా పూర్వస్థితికి రావడం కష్టం.

దోచింది రూ.5.86 కోట్లు.. దొరికింది రూ.15.84లక్షలు

(ఐదో పేజీ తరువాయి)

పరాలైనట్టు అప్పట్లో గుర్తించారు. ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. అప్పటి సీఐడీ అడిషనల్ ఎస్పీ రవివర్మ ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి.. బాధితులు ఇచ్చిన వాంగ్మూలం మేరకు సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. అలాగే ఈ వ్యవహారంలో ఏ-1 గా ఉన్న కోరాడ గణేశ్వరరావు, అతని భార్య లక్ష్మీ, గణేశ్వరరావు వియ్యంకులు అంధవరపు సూర్యనారాయణ, భారతిపై కేసులు నమోదు చేశారు. చీటీల పేరిట మోసాలకు పాల్పడినట్టు నిర్ధారించి.. వారిని అరెస్టు చేశారు. అయితే నమ్మించి ఖాతాదారులను నట్టేట ముంచిన గణేష్ చర, స్థిరాస్తులపై కూడా సీఐడీ అధికారులు నిఘా పెట్టారు. ఎల్ఐసీ, పోస్టల్, ఇతర ప్రైవేటు బీమా సంస్థల్లో ఉన్న రూ.15.84లక్షలు చరాస్తులు జప్తునకుగానూ ప్రభుత్వానికి నివేదించారు. ఈ ఆస్తులు జప్తు చేయాలని ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ తరహా కేసు నరసన్నపేట పట్టణంలో ఇదే మొదటిది కావడం గమనార్హం. కాగా.. గణేష్ చీటీలు, డిపాజిట్ల రూపంలో రూ.5.86కోట్లు వరకూ దోచుకోగా.. ఈ వ్యవహారంలో నిందితులుగా ఉన్న నలుగురు పేరిట కేవలం రూ.15.84లక్షలు మాత్రమే చరాస్తులు గుర్తించారు. మిగతా సొమ్మును గణేష్ ఎక్కడదాచాడో ఇంకా తెలియాల్సిఉంది. ఇక ఏఏ ప్రాంతాల్లో స్థిరాస్తులు ఉన్నాయో..వాటి విలువ ఎంతనేది తేలాల్సిఉంది. అప్పట్లో గణేష్ ఈ డబ్బులతో ఎక్కువగా బంగారం కొనుగోలు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి.

అమ్మేసుకున్నామోచ్!

(ఐదో పేజీ తరువాయి)

పాల్పడినవారిపై వేటుకురంగం సిద్ధంచేశారు.ఇదిలాఉండగాఅప్పట్లో తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలిచ్చిన జాబితాలు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది.

●ఇటీవల రెవెన్యూ అధికారులు జగతిమెట్ట కాలనీలో ఇంటింటికీ సర్వే చేస్తూ పట్టాలు చూపని ఇళ్ల, ఖాళీ స్థలాలపై 'ఇది ప్రభుత్వ స్థలం.. ఆక్రమిస్తే చర్యలు తప్పవు' అని బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. వాస్తవానికి రెవెన్యూ అధికారులు అక్కడ ఇచ్చిన పట్టాలు 332 అయితే ప్రస్తుతం 420కు పైగా లేఅవుట్లు కనిపిస్తున్నాయంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతోంది. అప్పట్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు ఇళ్ల పట్టాలు అక్రమాల్లో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది తాజా తనిఖీలతో.. ఆయా అక్రమార్కుల్లో అలజడి రేగుతోంది. కాగా ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా 'అప్పట్లో పనిచేసిన రెవెన్యూ సిబ్బంది పాత్రపై దర్యాప్తు చేస్తున్నాం. కొంతమంది ఇంటిదొంగలను గుర్తించాం. త్వరలో మరింత దర్యాప్తు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

పనులు పూర్తి కాక.. ప్రయాణికుల పాట్లు

●రాళ్లు తేలడంతో తరచూ ప్రమాదాలు

● ఇదీ అక్కుపల్లి -బెండిగేటు జంక్షన్ వరకు దుస్థితి

వజ్రపుకొత్తూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి నుంచి వజ్రపుకొత్తూరు వరకు, గల్లి నుంచి బెండిగేటు జంక్షన్ వరకు గల తారురోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు పాట్లుపడుతున్నారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లు దాటినా పూర్తికాలేదు. రోడ్డుపై చిప్స్‌వేసి విడిచిపెట్టడంతో రాళ్లతేలాయి. దీంతో అడుగడుగునా రోడ్డుపై రాళ్లతేలడంతో ద్విచక్ర వాహచోదకులు పల్టీలు కొట్టి తరచూ గాయపడుతున్నారు.రాళ్ల తేలిన రోడ్డుపై రాకపోకల సాగించడంతో వాహనాలు త్వరగా పాడవుతున్నాయని చోదకులు వాపోతున్నారు. దీనికితోడు నిత్యం దుమ్ముదూళి వల్ల రోడ్డుకు ఇరువైపుల నివాసముంటున్నవారు అసౌక్యరానికి గురవుతున్నారు. గతప్రభుత్వం హయాంలో రోడ్డు నిర్మాణా నికి నిధులు మంజూరు చేయకడంపోవడంతో మధ్యలో పనులు నిలిచిపోయాయని అధికారుల చెబుతున్నారు. అక్కుపల్లి, బైపల్లి, చినవంక, బాతుపురం, వజ్రపుకొత్తూరు, గరుడుభద్ర, ధర్మపురం, బెండివద్ద రోడ్డుఅధ్వానంగా మా రింది. కాగా ఎన్‌డీబీ నిధులు విడుదలైతే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ రవికాంత్ తెలిపారు.



అక్కుపల్లి జంక్షన్ వద్ద రాళ్లు తేలిన దృశ్యం

ఫిషింగ్ జెట్టీలు నిర్మించండి

● కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం/టెక్కలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలోని భావనపాడులో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేట, గార మండలంలోని కళింగపట్టణంలో ఫిషింగ్ జెట్టీలను నిర్మించాలని కేంద్రపౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కోరారు. 190 కిలోమీటర్ల తీరప్రాంతంఉన్న శ్రీకాకుళం జిల్లాలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆయా శాఖల మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ సానుకూలంగా స్పందించారు. జిల్లా నుంచి చాలామంది మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్, కేరళ, కర్ణాటక వంటి పశ్చిమ తీరప్రాంత రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని మంత్రికి వివరించారు. ఫిషింగ్ హార్బర్, జెట్టీల వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడడమే కాకుండా, వలసలు తగ్గి తీరప్రాంత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. ఈ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన సర్బానంద సోనోవాల్‌కి రామ్మోహన్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



సర్బానంద సోనోవాల్‌కి వినతిపత్రం అందజేస్తున్న రామ్మోహన్‌నాయుడు

హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్ లీఫ్ రేటింగ్: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని హోటళ్లు, లాడ్జీలకు గ్రీన్‌లీఫ్ రేటింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆయన హోటళ్లు, లాడ్జీల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో ఈవినూత్న వ్యవస్థ ద్వారా పరిశుభ్రతను నిర్ధారించడం వల్ల పర్యాటకులకు ఆహ్లాదకర, ఆరోగ్యకర, ఆనందకరమైన అనుభవం అందించవచ్చని తెలిపారు. పర్యావరణ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, పర్యాటక రంగంలో సురక్షితమైన పారిశుధ్యనిర్వహణకు ఈ రేటింగ్‌వ్యవస్థ ప్రవేశపెట్టినట్లు తెలిపారు.ఈరేటింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు కలెక్టర్ అధ్యక్షతన మునిసిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య మిషన్, జడ్పీ సీఈవో, మునిసిపల్ హెల్త్ అధికారి సభ్యులుగా కమిటీఉంటారని చెప్పారు. డీపీవో, జిల్లా పర్యాటకాధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్‌స్థాయిలో హోటళ్లు, లాడ్జిలు తనిఖీ చేయడానికి ఒక ఉపకమిటీని ఏర్పాటు చేస్తామని, గ్రామ పంచాయతీల్లోఉన్న వాటిజాబితాను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో శిక్షణనిర్వహిస్తామని తెలిపారు.జిల్లాలోని అన్ని హోటళ్లు, లాడ్జీలు ఈరేటింగ్ సాధించడానికి సహకరించాలనికోరారు. కార్యక్ర మంలో జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీపీవో భారతి సౌజన్య, పర్యాటకాధికారి నారాయణరావు, హోటల్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

30లోగా సలహాలు ఇవ్వండి

● పార్టీలకు సీఈసీ ఆహ్వానం ● ఎన్నికల అధికారులకు అందిన లేఖలు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చట్టపరమైన విధానంలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు రాజకీయ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకుల సలహాలను ఆహ్వానిస్తున్నట్లు భారత ఎన్నికల సంఘం(సీఈసీ) ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారులకు లేఖలు అందాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లాఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉంటే ఏప్రిల్ 30లోగా సూచనలు, సలహాలను అందించాలని కోరింది. గతవారం జరిగినసీఈసీ సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీజ్ఞానేష్‌కుమార్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల, జిల్లా ఎన్నికల, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సంభాషణలు నిర్వహించాలని, వచ్చిన సూచనలను చట్టపరిధిలో పరిష్కరించాలని, మార్చి31లోగా చర్యలనివేదికను సమర్పించాలని కోరారు.ప్రజా ప్రతినిధ్య చట్టం-1950, 51, ఓటర్ల నమోదు నియమాలు -1960, ఎన్నికల నిర్వహణ నియమాలు-1961, సుప్రీంకోర్టుఆదేశాలు, భారత ఎన్నికల కమిషన్ జారీచేసిన సూచనలు, మాన్యువల్స్ హ్యాండ్‌బుక్‌లు తదితర బలమైన, పారదర్శకమైన, చట్టపరమైన చట్రాన్ని ఏర్పాటు చేశాయని కమిషన్ రాజకీయ పార్టీలకు లేఖలో పేర్కొంది.

'యువత పోరు' నిరసన హాస్యాస్పదం

● తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు



మాట్లాడుతున్న బలగ ప్రహర్ష

అరసవల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి):ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించని జగన్ యువత పోరు పేరుతో నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదమని, వైసీపీ దొంగల ముఠా కలిసి పోస్టర్‌ను విడుదల చేయడం విడ్డూరంగా ఉందని తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లలో గుర్తుకు రాని జగన్‌కు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండగా గుర్తుకురావడం వింతల్లో వింత అని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలగ ప్రహర్ష, నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి గిరిజాశంకర్, సెక్రటరీ గుర్రాల సుమంత్ చౌదరి, కంచి నీలం, బగ్గు రవి పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం, మార్చి11(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, జత్వ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. ఈ మేరకు మంగళవారం ఇచ్ఛాపురంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో పిలక రాజలక్ష్మి, భారతిదివ్య, శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రకాష్‌రావు పట్నాయిక్ పాల్గొన్నారు

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి):రుణాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్. గడ్డెమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 21- 60 సంవత్సరాల మధ్య వయస్సు గల, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వెనుకబడిన తరగతులు,అగ్రవర్ణాల్లోని పేదలు, కుమ్మర, మేదర్లకు, డి.ఫార్మసీ/ బి.ఫార్మసీ పూర్తి చేసిన బీసీ, ఈడబ్ల్యుఎస్ నిరుద్యోగ యువతజెనరిక్ ఫార్మసీల నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 21-50 సంవత్సరాల మధ్య వయసు గల కాపుల నుంచి స్వయం ఉపాధిపథకాల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుతెలిపారు. అభ్యర్థులు రేషన్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్, మీసేవా, ఇంటర్‌నెట్ సెంటర్, సచివాలయంలోఈనెల 22లోగా నమోదుచేసుకోవాలని కోరారు.

రేపు సోంపేటలో ఉద్యోగ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సోంపేటలోని ఎంఎంఎస్‌లో డీఆర్డీఏ, సీడాప్ సంయుక్తంగా గురువారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎం, నవతరోడ్ ట్రాన్స్‌పోర్ట్‌కంపెనీలు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్,వెహికల్ క్లీనర్ ఉద్యోగాల కోసం ఎంపికలు చేపడతాయని పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ విద్యార్హతలు కలిగి, 19నుంచి 30సంవత్స రాల వయస్సు గల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ జిల్లా కన్వీనర్‌గా సూర్యారావు

బూర్జ, మార్చి11 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ మంగళవారం ప్రకటించారు.ఈమేరకు జిల్లా కన్వీనర్‌గా విద్యావేత్త, బూర్జ మండల ఉపాధ్యక్షుడు బుడుమూరు సూర్యారావును నియమించారు.శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ కన్వీనర్లగా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్, సీనియర్ జర్నలిస్టు బెండి నరసింగరావు, చాపర వేణుగోపాల్ నియమితులయ్యారు.

బ్యాంకుల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలి



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని, ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని యునైటెడ్ ఫొరంఆఫ్ బ్యాంకు యునియన్ కన్వీనర్ బి.శ్రీనివాసులు కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని సింహద్వారం వద్ద ఉన్న యానియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట యునైటెడ్ ఫొరం ఆఫ్‌బ్యాంకు యునియన్ పిలుపు మేరకు ఉద్యోగులు, అధికారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, రీజనల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు, గిరిధర్ నాయక్‌లు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులపై దాడులను ప్రభుత్వం ఖండించాలన్నారు. తాత్కాలిక పద్ధతిలోచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగుల రుణసముదాయాలపై ట్యాక్స్ వసూలు చేసే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులుకరుణ, శ్రావణి, సూర్య, నరేష్, సూర్యకిరణ్, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇసుక విధానంపై చర్చకు రావాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానంపై చింతాడ రవికుమార్‌తో పాటు వైసీపీ నాయకులు చర్చకు రావాలని టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు సనపల డిల్లీశ్వరరావు, కిల్లి సిద్ధార్థ, కంచరాన లోకేష్, కళింగ కార్పొరేషన్‌డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంపై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.ఐదు వేలుకు కొనుగోలు చేసిన నిర్మాణదారులకు నేడు రూ.800కే దొరకుతోందని తెలిపారు.అటువంటి జనరంజక ఇసుక విధానాన్ని వైకాపా చోటా నాయకుడు చింతాడ రవికుమార్ కోట్ల రూపాయలు దోపిడీ జరుగుతుందంటూ అసత్య ప్రచారాలు చేయడం అవివేకమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తమ్మినేని అప్పలనాయుడు, బొడ్డేపల్లి విజయ్, హనుమంతు బాలకృష్ణ, గణపతి పాల్గొన్నారు.

బెజ్జిపుట్టుగలో గరుడ వాహనసేవ

కవిటి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): బెజ్జిపుట్టుగలోని శ్రీచక్రపెరుమాళ్లస్వామి డోలోత్సవాలతోపాటు తృతీయ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం గరుడవాహనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధుల్లో గరుడవాహనాన్ని ఊరేగించారు.వంశపారంపర్య ధర్మకర్త పి.కృష్ణారావు,కుమారి దంపతులు పూజలుచేశారు.మడమల రాంబాబు బాగవతార్‌చే హరికథా గానం నిర్వహించారు. కళాకారులు శాస్త్రీయ సంగీతవిభావరి కార్యక్రమాన్ని చేపట్టారు.

పాత కోటమ్మతల్లికి పూజలు

కంచిలి, మార్చి11(ఆంధ్రజ్యోతి):మండలంలోని బసవుట్టుగలో గల పాత కోటమ్మ, పాల పోలమ్మ అమ్మవార్ల ఆలయాలను మంగళవారం ప్రతిష్ఠించారు.ఈ మేరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు పూజలు నిర్వహించారు.

పాఠశాలకు 50 కుర్చీల వితరణ

కంచిలి,మార్చి11(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎస్ఆర్‌సీపురం ఎంపీపీ పాఠ శాలకు సోంపేట రోటరీ క్లబ్ సభ్యులు 50 కుర్చీలను వితరణ గా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చలపతిరావు, శివాజీ, చ్ఎం ముకుందరావు, లక్ష్మణరావు, కుమారి, పాల్గొన్నారు.

వ్యర్థ జలాలు శుద్ధి చేయండి

రణస్థలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల వ్యర్థ జలాలు శుద్ధిచేసి కందివలసగెడ్డ, సముద్రంలోకి విడిచిపెట్టాలని నారువ, అక్కయ్యపాలెం, బోయిపాలెం గ్రామస్థులు కోరారు. మంగళవారం పైడిభీమవరం పంచాయతీ పరిధిలోని సరాకా పరిశ్రమఎదురుగా ఆందోళనచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల వ్యర్థాల వలన అనారోగ్యం పాలవుతున్నామని వాపోయా రు. భూగర్భ జలాలు, కందివల గెడ్డ కలుషితమయ్యిందని తెలిపారు.



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న యువకులు, మహిళలు

పోషకాహారం అందించడమే లక్ష్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో మొబైల్ డిస్పెన్సింగ్ వాహనం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీఈవో తిరుమల చైతన్య, ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి, సీఎస్‌డీటీ చక్రవర్తి పాల్గొన్నారు.

'వికసిత్ భారత్' ధ్యేయం

టెక్కలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, వికసిత్ భారత్ బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. మంగళవారం టెక్కలిలో పార్టీ కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రాంతం నుంచి కార్యకర్తలను తయారు చేసేటట్లు క్షేత్రస్థాయి నాయ కత్వం పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు పైడి వేణుగోపాలరావు, జిల్లా ఇన్‌చార్జి విజయ్‌కుమార్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, సువ్వారి ఉమామహేశ్వరరావు, నడుపూరు లక్ష్మీనారాయణ, జర్జాన రామ్‌జీ, బూరె నరేంద్రచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించండి

ఇచ్ఛాపురం, మార్చి11(ఆంధ్రజ్యోతి):తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి కోరారు.మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కొళాయిల ద్వారా నీటి సరఫరా లేని ఏఎస్‌పేట, పురుషోత్తపురం 1,2,3 వార్డుల్లో రోజుకు పది ట్రిప్పులు చొప్పున నీరందివ్వాలని తెలిపారు.బోర్ల మరమ్మతు లకు మెటీరియల్ కొనుగోలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, ఏఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

భవనాలు పూర్తి చేయాలి

రణస్థలం,మార్చి11(ఆంధ్రజ్యోతి):గతప్రభుత్వం హయాంలో ఉపాధి నిధులు సకాలంలో అందక చాలామంది కాంట్రాక్టర్లు ఇబ్బందిపడ్డారని జిల్లా సర్పంచ్‌ల సం ఘం అధ్యక్షుడు పిన్నింటి వెంకటభానోజీనాయుడు తెలిపారు. అర్థాంతరంగా ఆగిపోయిన ప్రభుత్వభవనాలు త్వరగా పూర్తి చేయాలని కోరారు. మంగళవారం రణస్థలం పంచాయతీ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం నిధులతో జరిగిన పను లపై ఆడిట్ గ్రామ సభ జరిగింది. కార్యక్రమంలో సోషల్ ఆడిటర్ ఎ.రాజు, సెక్రటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ పరీక్షకు 89 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్ -1, ఎకనామిక్స్ -1 పేపర్ల పరీక్షలు జరిగాయి. పరీక్షలకు సెట్-3 పేపర్ వినియోగించారు. జనరల్ విభాగంలో 20,756 మందికిగాను 19,982 మంది హాజరు కాగా 774 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యకు సంబంధించి 1,319 మందికి గాను 1,230 మంది హాజరు కాగా 89 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద 22,075 మందికి గాను 21,212 మంది హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని అధికారులు ధ్రువీకరించారు.

విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి

ఆమదాలవలస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయంతో చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్‌ను తక్షణమే కాపాడాలని వైసీపీ రాష్ట్రకార్యదర్శి కేవీజే సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట బుధవారం పార్టీ నిర్వహిస్తున్న యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.

పూజారి కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం,మార్చి11(ఆంధ్రజ్యోతి): కొఠారి శివాలయంలో పూజారి వెంకటరావు రౌళో కుటుంబానికి పోలాండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం సభ్యులు అండగా నిలిచారు. పూజారికి సరిగ్గా కళ్లు కనిపించడంలేదు. దీనికి తోడు కుమారుడు దివ్యాంగుడుకావడంతోపాటు భార్య కిడ్నీవ్యాధితోపాటు పెరాలసిస్ వల్ల కాళ్లు చేతులు పనిచేయడం లేదు.దీంతో విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు ఆదుకోవాడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం రూ.41వేలు అందించారు. కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ తిప్పన శేఖర్, శ్యాం, పూర్ణచంద్ర, సంఘ ప్రతినిదులు, టీడీపీ నాయకుడు సాడి సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు. పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

సరుబుజ్జిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.692.15 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు టీడీపీ కార్యాలయం ఒకప్రకటనలో మంగళవారం పేర్కొంది. ఉపాధి హామీ పథకంలో మం జూరైన నిధులతో ఆరు తారురోడ్లకు రూ.678 లక్షలు, మూడు సీసీ రోడ్లు నిర్మాణానికి 14.15 లక్షలు మంజూరు చేశారని తెలిపింది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుజరాతీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ తమ్మినాన చందనరావు కోరారు. ఈ మేరకు విజయవాడలోని సమగ్ర శిక్ష అదనపు రాష్ట్ర ప్రధాన సంచాలకుడు ఎం.ఆర్. ప్రసన్నకుమార్‌ను మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న సీఆర్ఎంటీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు.పదవీవిరమణ 62 ఏళ్లకు పెంచాలని,ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతికి మార్చాలని, ఒకటో తేదీను వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో సమర్పించారు.



జీడి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



విద్యుత్ శాఖా మంత్రి రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న శిరీష

పలాస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జీడి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జీడి పప్పు ధరల్లో ఎటువంటి ఇబ్బందులు లేకపోయినా జీడి పంట పండించే రైతులు అనేక రీతులా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి రైతుల సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇప్పటికే జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, మద్దతుధర కూడా ప్రకటిస్తే వేలాది మంది జీడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే వ్యాపారులు అదనపు లోడ్ విద్యుత్ బిల్లుల భారంతో ఇబ్బందులు పడుతున్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. ఈ మేరకు అసెంబ్లీ ఆవరణలో ఆయనను శిరీష కలిసి వినతిపత్రం అందించారు.

అసెంబ్లీలో మన వాణి

సాంకేతిక విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి

● పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు



పాతపట్నం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యార్థులకు సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. నియోజక వర్గ పరిధిలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బాలికల్లో విద్యపై ఆసక్తి ఉన్నా దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో అర్ధంతరంగా చదువును ఆపేస్తున్నారని, అందువల్ల మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.

భవన నిర్మాణాలపై దృష్టి సారించండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం నిధులతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలపై దృష్టిసారించాలని ఆమదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరా రు. మంగళ వారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మొదటి, రెండో దశగా 12,496 భవనాలు మంజూరు చేయగా 6,136 నిర్మాణాలు పూర్తిచేసినట్టు రికార్డులు చూపుతున్నారని తెలిపారు. నాడు-నేడు ద్వారా ఒక శాతం మేర అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టినట్టు తెలిసిందన్నారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యం వల్ల అంగన్‌వాడీ భవన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ, నాబార్డు, నాడు-నేడుతో చేపట్టిన భవన నిర్మాణాలపై దృష్టి పెట్టాలని కోరారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



రణస్థలం, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గం పరిధిలో 28 వేల మంది మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు కోరారు. శాసన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల పరిధిలో తీర ప్రాంతం విస్తరించి ఉందని, గత ప్రభుత్వం జట్టీతో పాటు మినీ హార్బర్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చ లేదన్నారు. కొవ్వాడ అణువిద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు 15 ఏళ్ల నుంచి కార్యాచరణ ప్రారంభ మైందని, దీంతో కొవ్వాడ మత్స్య లేశం నిర్వాసిత గ్రామంగా మిగిలిందని, భూసేకరణలో పరిహారం భూస్వాములకు మాత్రమే దక్కిందని తెలి పారు. ఇంకా 25 మత్స్యకార కుటుంబాలకు నష్ట పరిహారం అందలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారుల విషయంలో అంకెల గారడీ ప్రదర్శించిందని ఆరోపించారు. తీరంలో హార్బర్లతో పాటు జెట్టీలను నిర్మిం చాలని కోరారు. కొవ్వాడ అణు విద్యుత్ పరిశ్రమ నిర్వాసితులకు పరి హారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

● ఇద్దరు పలాస వాసుల మృతి
● మహేంద్రగిరి నుంచి చింతపండు తీసుకువస్తుండగా ఘటన
● సూదికొండ, సాయిబుల కాలనీలో విషాదఛాయలు

పలాస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం మహేంద్రగిరి-గండాహతి రోడ్డులో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస మునిసిపాలిటీకి చెందిన బుట్ట గంగాధర్ (32), సాయిబుల కాలనీకి చెందిన సయ్యద్ ఫరీద్ (22) మృతి చెందారు. గంగాధర్ భార్య సరళ తీవ్ర గాయాపాలై పర్లాకిమిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దివ్యాంగుడైన బుట్ట గంగా ధర్ జీవనోపాధి నిమిత్తం భార్య సరళ, స్నేహితుడైన సయ్యద్ ఫరీద్‌తో కలిసి చింత పండు వ్యాపారం చేస్తున్నాడు. వీరు ఒడిశాలోని మహేంద్రగిరి, గండాహతి ప్రాంతాల్లో గిరిజనుల వద్ద చింతపండు కొనుగోలు చేసి పలాస- కాశీబుగ్గలో విక్రయిస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం చింతపండు కొనుగోలు చేసుకొని ద్విచక్ర వాహనంపై పలాస వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపో యారు. ఫరీద్ అక్కడికక్కడే మృతి చెందగా గంగాధర్ సమీపంలోని ఓ ఇంటి రేకులపై పడి తీవ్రగాయాలకు గురయ్యాడు. ఆయనను ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మృత్యువాత పడ్డాడు. సరళ తీవ్ర గాయాలతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. గంగాధర్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా, సయ్యద్ అవివాహితుడు. మృతుదేహాలను పోస్టు మార్టం నిమిత్తం పర్లాకిమిడి జిల్లా ఆసుపత్రికి తరలించారు. బుధవారం మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగిస్తామని పోలీసులు తెలి పారు. పలాసకు చెందిన ఇరువురు మృతి చెందడంతో సూదికొండ కాలనీ, సాయిబుల కాలనీల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతులిద్దరూ రోజువారి ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో వారు మృతితో ఆయా కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. ఘటన స్థలానికి స్థానికులు చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పర్లాకిమిడిలో మార్చురీకి మృతదేహాన్ని తరలిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

'కేశవరెడ్డి'పై చర్యలు తీసుకోవాలి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో కేశవరెడ్డి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లి దండ్రులను మోసగించాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని కోరారు. మంగళవారం శాసన సభలో ఆయన మాట్లాడుతూ.. 2010లో 800 మంది విద్యార్థులు ఈ పాఠశా లల్లో విద్యాభ్యాసం చేశారని తెలిపారు. అప్పట్లో ప్రతి విద్యార్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేశారని, మొత్తం రూ.42 కోట్లు వసూలు చేసి చేతు లు ఎత్తేశారన్నారు. ఈ విద్యాసంస్థపై ఇప్పటికే 15 కేసులు నమోదయ్యాయన్నారు. అయినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. విద్యాశాఖ మంత్రి చర్యలు తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

ఒకే వ్యక్తిపై రెండు కేసులు

పాతపట్నం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బొన్ని గ్రామానికి చెందిన సవర చిన్నప్పన్న 5 లీటర్ల సారాతో గ్రామంలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. కాగా నిందితుడిని విచారించగా బొన్ని గ్రామ సమీపంలోని కొండపై సారా తయారీకి 200 లీటర్ల పులిసిన బెల్లంఊట నిల్వ ఉంచినట్లు నిర్ధారణ కావడంతో ఆ ఊటను ధ్వంసం చేశా మన్నారు. ఈ మేరకు మరో కేసు నమోదు చేసి శ్రీకాకుళం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఈనెల 24వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

సోంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజాంలో ఐదు లీటర్ల సారాను హేమరాజు నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టుచేసినట్లు బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. జింకిభద్రలో బెల్టుషాపుపై సోంపేట ఎస్ఐ లవరాజు దాడులను నిర్వహించి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టుచేశారు.

50 సారా ప్యాకెట్లు..

ఇచ్ఛాపురం, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఎర్రగోవిందపుట్టుగ గ్రామానికి చెందిన ఎర్ర హరికృష్ణను అరెస్ట్ చేసి ఆయన వద్ద ఉన్న 50 ఒడిశా సారా ప్యాకెట్లు సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ పి. దుర్గాప్రసాద్ తెలిపారు. దాడుల్లో జీవీ రమణ ఇన్‌స్పెక్టర్ మొబైల్ పెట్రోలింగ్, జీసీహెచ్‌వి రమణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ఆయిల్ చోరీ

ఆమదాలవలస, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అక్కులపేట ఎత్తిపోతల పథకం పరిధిలోని బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు కుడి ప్రధాన 20ఆర్ పిల్ల కాలువ వద్ద ఉన్న ఎలక్ట్రికల్ మినీ సబ్ స్టేషన్‌లోని మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లో కాయిల్స్, ఆయిల్ చోరీకి గురయ్యాయని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు తెలిపారు. చోరీకి గురైన సొత్తు సుమారు రూ.15 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. ఈ చోరీపై వంశధార ఇంజనీరింగ్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొంతమంది కుట్రచేసి దొంగతనం చేశారని గౌరీపతిరావు పేర్కొన్నారు.

చాకచక్యంతో వ్యవహరించి.. ప్రాణాలు రక్షించి

● ఆటోలో ఒక్కసారిగా మంటలు

ఇచ్ఛాపురం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకూరుకు చెందిన పుక్కల రవి ఆటోలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఆటో దగ్ధమైంది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు.. డొంకూరు నుంచి మంగళవారం రవి ముగ్గురు ప్రయా ణికులతో ఒడిశా ఆటోలో బయలుదేరాడు. ఒక్కసారిగా పెద్దలక్ష్మీపురం వద ఆటోలో నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో రవి చాకచక్యంగా వ్యవహరించి ప్రయాణికులను దించేయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఆటో పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఆటో పూర్తిగా కాలిపోవడతో జీవనాధారం కోల్పోయి రోడ్డున పడ్డానని రవి వాపోతున్నారు. రవిని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నాయకుడు చీకటి కృష్ణయ్య కోరారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పలాస,మార్చి11(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ తాళభద్ర గేటు నుంచి జయరామచంద్రపురం వెళ్లే దారిలో మంగళవారం సాయంత్రం కాశీబుగ్గ పట్టణానికి చెందిన ఐదుగురు పేకాట ఆడుతుండగా దాడిచేసినట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9430 నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యంపై ఫిర్యాదు

పలాస, మార్చి11(ఆంధ్రజ్యోతి): మందస మండలం వాసుదేవపురం గ్రామానికి చెందిన తన భార్య జ్యోతి, కుమార్తె హాన్విక అదృశ్యమైనట్లు పోలీసులకు జ్యోతి భర్త సాలిన సింహాచలం ఫిర్యాదు చేశారు. ఈనెల 10న తన భార్య, కుమార్తెలు కొర్రాయి గేటు వద్ద తనను ఉండమని చెప్పి ఎంతకూ రాకపోవడంతో తన అత్తవారి గ్రామమైన లొద్దభద్ర, ఇతర బంధువుల ఇంట్లో వాకబు చేయగా వారి ఆచూకీ లభించలేదు. ఆమె మొబైల్‌కు ఫోన్ చేస్తున్నా నాట్ రీచ్‌బుల్ అని వస్తుం డడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హరిపురం అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గౌతు శివాజీ

హరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హరిపురం గ్రామ అభివృద్ధికి టీడీపీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. హరిపురంలో మంగళవారం ఆయన కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ.. వైసీపీ పాలనలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్నచౌదరి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, బైరిశెట్టి గున్నయ్య, బమ్మిడి కర్రయ్య, రుద్రయ్య పాల్గొన్నారు.

భూ ఆధార్ పక్రియ వేగవంతం చేయాలి

నరసన్నపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు ఆధార్ నెంబరు అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మంగళవారం తామరాపల్లి, సత్యవరం గ్రామాల రైతు సేవాకేంద్రాల్లో భూ ఆధార్ నమోదు పక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధంకండి

వజ్రపుకొత్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు సమీపిస్తున్నందున కాలాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్ కుమార్, ఎంఈవో వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం అక్కుపల్లి ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు, పాఠశాల కమిటీ చైర్మన్ ధనలక్ష్మి, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'సంకల్ప్' బాక్స్‌ల ఏర్పాటు

వజ్రపుకొత్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో సంకల్ప్ ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పలు పాఠశాలకు ఫిర్యాదుల పెట్టెలను అందించారు. బాలికలు తమకు కలిగిన ఇబ్బందుల వివరాలను ఈ బాక్సులో వేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



పూర్వ విద్యార్థుల అందించిన కుర్చీలు

కొత్తూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు రూ.1.25 లక్షల విలువైన 125 స్టడీ కుర్చీలు, ప్లాంకులను అందజేసినట్లు హెచ్‌ఎం ఎ.గోవిందరావు తెలిపారు. ఇటీవల పాఠశాలలో జరిగిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న 16 మంది పూర్వ విద్యార్థుల చందాలు వేసుకుని బడిరుణం తీర్చుకున్నార న్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఒడియా భాషాభివృద్ధికి కృషి చేయాలి

హరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒడియా భాష, సంస్కృతి, విద్యా రంగాల అభివృద్ధికి కృషి చేయాలని ఒడిశా రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి పూర్ణచంద్ర మహాపాత్రో కోరారు. మందసలో ఒడిశా రాష్ట్ర భాషా దినోత్సవాన్ని ఒడియా యంగ్‌మెన్ లైబ్ర రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఒడియా మైనార్టీ అసోసియేషన్ నాయకుడు సత్యనారాయణ పాడి, దుర్గాప్రసాద్ పాణిగ్రహి తదితరులు మాట్లాడుతూ.. 1956 లో భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజనలో గంజాం జిల్లాలో అనేక ప్రాంతాలు శ్రీకాకుళంగా ఏర్పా టయ్యాయని, వీటిలో వేలాది కుటుంబాలు ఒడియా మైనార్టీ ప్రజలు ఉన్నారన్నారు. వీరందరి అభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జగన్నాథ స్వామి ప్రచారకులు శరణ్ వింద్ పజా, భాస్కర్‌పాడి, రవీంద్ర కుమార్ పాడి, జగదీష్‌పండా పాల్గొన్నారు.

'ఎరుకల రామాయణం'పై పత్ర సమర్పణ

● దక్షిణ భారత జానపద విజ్ఞాన సదస్సులో జిల్లా వాసి



మాట్లాడుతున్న బద్రి కూర్మారావు

పలాసరూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జానపద విజ్ఞాన సదస్సు చిత్తూరు జిల్లా తిరుపతి సంస్కృత విశ్వ విద్యాలయంలో జరిగింది. ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఈ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సులో జిల్లాకు చెందిన గిడుగు రామమూర్తి కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు పాల్గొని ఉత్తరాంధ్రలో అంతరిస్తున్న 'ఎరుకల రామాయణం'పై పత్ర సమర్పణ చేశారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో తెలుగు, తమిళ, కర్ణాటక, కేరళ, పంజాబ్ రాష్ట్రాల జానపద పరిశోధకులు హాజరై ఆ రాష్ట్రాల జానపద కళారీతులు, వాటి చారిత్రక వైశిష్ట్యాలను వివరించారని కూర్మారావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జానపద పరిశోధకులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

● రూ.87.50 లక్షల ఎంపీల్యాడ్ నిధులు విడుదల
● 15న శంకుస్థాపన చేయనున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు



కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటన రోడ్ మ్యాప్‌పై కమిషనర్‌తో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంపీల్యాడ్ నిధులు రూ.87.50 లక్షలు కేటాయించడంతో వీటితో 15 పనులను చేపట్టనున్నారు. ఈ మేరకు ఈ నెల 15న అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రామారావుతో టీడీపీ నాయకులు చర్చించారు. ఎంపీల్యాడ్ నిధులు గతంలోనూ కేటాయించగా నాడు రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పనుల్లో జాప్యం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావ డంతో ఎంపీల్యాడ్ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఏయే పనులు చేపడతారంటే..

మంజూరైన ఎంపీల్యాడ్ నిధులతో పట్టణంలోని 14, 19, 22, 24, 25, 27, 28వ వార్డుల్లో బోర్‌వెల్స్, 29 వార్డులో సీసీ కాలువ, 7, 16, 17, 18 వార్డుల్లో సీసీ రోడ్లు, 4, 7 వార్డుల్లో కమ్యూ నిటీ హాళ్ల నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ పనులకు సంబం ధించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ నుంచి మునిసిపల్ అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపలతో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రానికి ఎన్ఆర్ఐలు ఇచ్చిన ఐదు డయాలసిస్ యూనిట్లను మంత్రులు ప్రారంభించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. వీటికి సంబంధించి రోడ్ మ్యాప్‌ను రూపొందించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్య దర్శి పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సప్ప నవీన్, కొరికాన శంకర్, సవర రాంబాబు, దడియాల నర్సింహులు, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్లపై సోలార్ ప్లాంట్లు

● 'పీఎం కుసుమ్' పథకం ఏర్పాటుకు 25 చోట్ల స్థలాల గుర్తింపు

టెక్కలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి సంబంధించి పంపు సెట్లకు అవసర మయ్యే విద్యుత్ ఉత్పాదనను సోలార్ ద్వారా అందించేందుకు 'పీఎం కుసుమ్' పథకంలో భాగంగా జిల్లాలో 25 ప్రాంతాలను ఎంపిక చేశారు. వీటిని వంశధార కుడికాలువ గట్లపై ఏర్పాటు చేసేందుకు గాను రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు ఉమ్మడిగా సర్వే చేప ట్టారు. ఒక్కోచోట సోలార్ ప్లాంట్ నుంచి 11 కేవీ విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా సోలార్ పలకల ఏర్పాటుకు స్థలాలను ఎంపికచేశారు. ఈ మేరకు శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతప ట్నం నియోజక వర్గాల్లో 25 ప్రాంతాలను పరిశీ లించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో కిష్టప్పేట నుంచి లింగా లవలస మధ్య, చింతాడ నుంచి అలికాం, సిలగాం సింగు వలస నుంచి కిష్టప్పేట, బైరి, అలికాం, గార, చల్లపేట, కళింగపట్నం, తూలుగు, కనుగుల వానిపేట ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాద నలు చేశారు. ఆమదాలవలస నియోజక వర్గంలో హిరమం డలం- శ్యామలా పురం మధ్య, గాజుల కొల్లివలస జంక్షన్, సరుబు జ్జిలి, కొల్లివలస, మదనాపురం, పాతపట్నం నియోజకవర్గంలో మర్రిపాడు- పారాపురం, కొత్తూరు, నివగాం లను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో టెక్కలి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, టెక్కలి డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ శంకరరావు సంయుక్తంగా ఈ అంశాలపై సమీక్షించారు. ఈ స్థలాల పరిశీలన అనంతరం పీఎం కుసుమ్ పేరిట సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసే దిశలో చర్యలు తీసుకుంటున్నారు.

వైభవంగా వల్లభనారాయణ డోలోత్సవాలు



ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

హరిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రట్టి వల్లభనారాయణ స్వామి డోలోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వేకువ జామునుంచే ప్రధాన అర్చకులు రట్టి సీతారాం, నీలకంఠం, ప్రహ్లాదులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు. పూజలు నిర్వహించారు. ఆలయం భక్తులతో కళకళలాడింది. స్వామి తిరువీధి ఉత్సవం కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శిం చుకుని ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు.

గ్రంథాలయ పనివేళల్లో మార్పు చేయాలి

హిరమండలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాఠకులకు అనుగుణంగా గ్రంథాలయ పనివేళల్లో మార్పు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. పాఠకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి ప్రహరీ, తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామని పాఠకులు పేర్కొనగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2024-25లో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా గ్రంథాలయ సెస్ బకాయిలు రూ.3.50 కోట్లు ఉండగా రూ.2కోట్లు మాత్రమే వసూలయ్యాయని తెలిపారు. డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, గ్రంథాలయాధికారి ఎర్రమ్మ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆశీలు పాట వాయిదా

నరసన్నపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆశీలు వసూలుకుగాను మంగళవారం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం శ్రీకాకుళం డీఎల్‌పీవో ఐవీ రమణ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. అయితే ఈ బహిరంగ వేలంలో వేలంపాటదారులు సిండికేట్‌గా మారి సంత, రోజువారీ మార్కెట్, చేపలు మార్కెట్‌లకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే తక్కువగా పాటలో కోడ్ చేశారు. ఈ నేప థ్యంలో ఈనెల 15కు వేలంపాట వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి విజయ్‌కుమార్, ఈవో ద్రాక్షాయిణి, మురళీ పాల్గొన్నారు.

జీడితోట వేలంపాట..

పోలాకి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఆధీనంలో ఉన్న కోడూరు జీడితోట వేలం పాట వాయిదా పడినట్టు ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, సూపరింటెండెంట్ బలగప్రకాష్ తెలిపారు. వేలంపాట మంగళవారం నిర్వహించగా వేలంపాటదారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మించి పాడకపోవడంతో ఈనెల 18కి వాయిదా వేశామన్నారు. గత ఏడాది రూ1.96,600లకు ప్రభుత్వ ధర నిలువగా ప్రస్తుత వేలం పాటలో ఎవరూ ఆ ధరకు మించి పాట పాడలేదని, అందువల్ల వాయిదా వేశామన్నారు.

18, 19 తేదీల్లో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రచారం

వజ్రపుకొత్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి తీరప్రాంతంలో ఏర్పాటు చేయ నున్న ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ఈనెల 18, 19 తేదీల్లో వామపక్ష పార్టీలతో కలిసి ప్రచారం చేపట్టనున్నట్లు సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్, న్యూడెమోక్రసీ నాయ కుడు వంకల మాధవరావు పేర్కొన్నారు. ఒంకులూరులో మంగళవారం సమావేశం నిర్వహించి చర్చించారు. 18న మందస మండలం, 19న వజ్రపుకొత్తూరు మండలంలో ప్రచారం చేయనున్నట్లు చెప్పారు.

నేటినుంచి వెంకటేశ్వర స్వామి డోలోత్సవం

హిరమండలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హిరమండలం సుభలయ మెట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి డోలోత్సవాలను బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చివరి రోజు శుక్రవారం వంశధార నదిలో చక్రతీర్థ స్నాన మహో త్సవం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించి తరించాలని వారు ఒక ప్రకటనలో కోరారు.